# ఎదురు చూసిన క్షణం

'వాచస్పతి'

ప్రశాంత్ ప్రైజ్ తీసుకుంటూ, రెండవ వరసలో కూచో నున్న తల్లి ముఖంలోకి చూశాడు. సంతోషంగా. రమ కళ్ళు మెరిశాయి! ఆ రోజు స్కూలు వార్షికోత్సవం. పిల్లల తల్లిదండ్రు లందరూ ఎంతో ఉత్సాహంగా హాజరయ్యారు. ఉపన్యాసా లయ్యాక బహుమతి ప్రదానం ప్రారంభమైంది. పేర్లు పిలవగానే వచ్చి బహుమతులు తీసుకుంటున్నారు పిల్లలు. ప్రశాంత్ పేరు మళ్ళీ రెండవ సారి పిలిచారు. ఈసారి తల్లి ముఖంలోకి గర్వంగా చూశాడు!

రమ హృదయంలో ఆనందపు తరంగాలు ఉవ్వెత్తున లేచాయి.

బహుమతి ప్రదానం ముగిసే సరికి ప్రశాంత్ ఆరు బహుమతు లందుకున్నాడు!

బహుమతు లివ్వడం ముగిశాక, సాంస్కృతిక కార్యక్రమం ప్రారంభమైంది.

నాటకంలో చిన్న పాత్ర వేశాడు ప్రశాంత్.

రెండు జానపద నృత్యాలూ, ఒక నృత్య నాటికా చాలా చక్కగా చేసి, ప్రేక్షకుల చేత శభాష్ అనిపించుకున్నారు పిల్లలు!

కార్యక్రమం ముగిశాక, తన బహుమతులను తీసుకుని తల్లి దగ్గర కొచ్చాడు ప్రశాంత్. ఇద్దరూ స్కూలు ఆవరణ దాటి, రోడ్డు మీద కొచ్చి ఆటో తీసుకుని ఇంటికి బయలు దేరారు.

ఇంటికి రాగానే సుమనా, సుజనా చిరునవ్వుతో ఎదురొచ్చారు. తన ప్రైజులు చూపించాడు ప్రశాంత్. ఇద్దరూ ఎంతో సంతోషించి, తమ్ముణ్ణి అభినందించారు.

"అన్నీ జాగ్రత్తగా దాచు. నాన్నా నానమ్మా వాళ్ళు వచ్చాక చూపిద్దువుగాని...' అంది రమ ప్రశాంత్‌తో.

తన ప్రైజులు తీసుకుని లోపలి కెళ్ళాడు ప్రశాంత్. సుజనా లోపలి కెళ్ళింది.

"నాన్నా వాళ్ళూ ఇంకా రాలే దేమి టమ్మా?" అంది సుమన, గుమ్మం వేపు వెళ్ళి వీధిలోకి చూస్తూ.

"ట్రైయిను బహుశా లేటేమో? ఎనిమిది దాటింది గంట. తమ్ముడు, మీరూ అన్నాలు తినండి!" అంది రమ.

"నా కప్పుడే తినాలని లేదమ్మా!" అంది తల్లి దగ్గర కొస్తూ సుమన.

"ఏం? తమ్ముడికి ప్రైజు లొచ్చాయన్న సంతోషంతో కడుపు నిండి పోయిందా?" అంది రమ మెల్లగా నవ్వుతూ.

"నా సంగతేమో గాని, నీకు మటుకు కడుపు నిండి పోయింది! ఇక రెండు రోజులు అన్నం తినవు కాబోలు! కదమ్మా?" అంది ఆప్యాయంగా తల్లి ముఖంలోకి చూస్తూ.

"ఊఁ!... సర్లే! నువ్వు తినకుంటే తర్వాత తిందువుగానీ, వాళ్ళిద్దరికి పెట్టు. ఓ పది నిముషాలు నన్నిలా కూచోనివ్వు!"అంది.

తల్లి మనసు సర్థం చేసుకున్న సుమన మరేమనక, లోపలి కెళ్ళి పోయింది.

రమ ముఖంలో అలసట కొద్దిగా కనిపిస్తున్నా ఆమె హృదయంలో పొంగి పొరలే సంతోషం, సంతృప్తి, ఆ అలసటను ప్రక్కకు నెట్టేశాయి.

గుండె మీద నుండి ఏదో పెద్ద బరువు తొలిగిపోయినట్లు తేలిగ్గా ఊపిరి తీసుకుంది. అనుకున్నది సాధించ గలిగా నన్న సంతృప్తి రేఖలు కళ్ళలో కదిలాయి.


'ఈ సమాజమూ, తన బంధువులూ ఇప్పు డేమంటారో?' అన్న ప్రశ్న మనసులో కలగగానే, సన్నని చిరునవ్వు తమ పెదవులపై కదిలింది.

మనసు గతంలోకి చూసింది.

పది సంవత్సరాల క్రిందటి మాట!

ఆ రోజు జీవితంలో తను ఓ పెద్ద నిర్ణయాన్ని తీసుకున్న రోజు! అందరి నుండీ తనకు వ్యతిరేకత లభించింది. నాలుగు వేపుల నుండి అసమ్మతి భావాలు వచ్చి తనను గుచ్చుకున్నాయి. అయితేనేం? అన్నింటినీ ధైర్యంగా ఎదుర్కొంది.

'ఉన్న ఊళ్ళో సలక్షణమైన ఉద్యోగం! సొంత ఇల్లుంది. పిల్లల చదువులకు జూనియర్ కాలేజీ ఉంది. ఇవన్నీ వదులుకుని, ఎక్కడకో వెళ్ళి ఏమిటి సాధించేది?" అంది అత్తమ్మ కోపంగా, విసురుగా.




"... అన్ని ఉన్నాయి! కానీ, ప్రశాంత్‌కు కావలసిన స్కూలు మటుకు లేదు!" అని తను శాంతంగానే జవాబిచ్చింది.

"హ... అక్కడి కెళ్ళి వాడు బి.ఎలూ, ఎమ్.ఎలూ చదివేస్తాడు! వాడి కోసం ఇంత మందిని వదలి, వేరే ఊరెళ్ళి, వేలకు వేలు ఖర్చు పెట్టడమా? రాజా ఇక్కడ లేకుంటే మాగతేం కావాలి? మీ మామ హార్టు పేషంట్! ఏ క్షణాన ఏమౌతుందో?" ఈ సారి ఆందోళనా, భయం ఆమె



కంఠంలో.

"ఎక్కడికి వెళ్తున్నాం, అత్తమ్మా? దేశం వదలి పెట్టి వెళ్ళి పోతున్నామా? విశాఖపట్నం ఇక్కడి కెంత దూరం? పది గంటల ప్రయాణం! అవసర మొచ్చి కబురు చేస్తే, రెక్కలు కట్టుకుని వాలమా? పైగా, ఇక్కడ మీరు వంటరి వాళ్ళలా అవుతారు? ప్రక్కనే చినమామ వాళ్ళున్నారు. ఊరినిండా బంధువులు!" తనను తాను నిగ్రహించుకుని చిరునవ్వుతో అంది.

"జవాబులు చెప్పడం బాగా నేర్చావు! అసలు మొదట్నుండీ మాతో ఉండడం ఇష్టం లేదు నీకు! ఇప్పు డీదో కుంటి సాకు దొరికింది! వేరు కాపురానికి తయారయ్యావు!" కచ్చగా అంది.

"ప్రశాంత్ భవిష్యత్తు ఓ కుంటి సాకా! దయచేసి, అలా అన కత్తమ్మా!" బాధగా అంది తను.

"ఇంకెలా అన మంటావు? ఇందరి మాట కాదని బయల్దేరు తున్నావు! ఇదీ మంచిది కాదు. ఇప్పటి కన్నా నీ మనసు మార్చుకో." కటు స్వరంతో అంది.

"అదెలా వీలవుతుంది? రేపే విశాఖ ప్రయాణం! మీ రెన్నన్నా చెప్పండి, నా నిర్ణయం మారదు. నా బాబు కోసం ఈ మాత్రం నేను చేయకుంటే, రేపు పెద్దయ్యాక వాడు నన్ను క్షమించడు! అంతే కాదు, నన్ను నేను క్షమించుకోలేను!" వ్యధా భరిత కంఠంతో అంది తను.

"వేరే ఊర్లో కాపర మంటే మాటలా? రాజా కక్కడ ఉద్యోగం దొరికినా ఎంతొస్తుంది? అది ఇంటి బాడుగకూ, నీ కొడుకు చదువుకూ సరిపోతుంది! ఏం తింటారు? ఆడపిల్ల లిద్దరున్నా రన్న జ్ఞానం ఉందా నీకు? వచ్చిందల్లా ఖర్చు చేస్తే వాళ్ళకు పెళ్ళిలా చేస్తావు?"

"అదెప్పటి మాట? ఆడ పిల్లలకు పెళ్ళిళ్ళు చేయాలని, ప్రశాంత్ భవిష్యత్తును నాశనం చేయమంటారా?"

"మనం నాశనం చేయడమేంటి? మన చేతిలో ఏం ఉంది? అంతా ఆ ఈశ్వరేచ్ఛ! అనవసరంగా లేని పోని బాధలు తెచ్చుకుని రాజాను కష్టపెడుతున్నావు! అంతే! ఇంత చేసినా, నువ్వు సాధించబోయేది ఏమీ ఉండదు!" అక్కడే కూచుని, ఏదో పుస్తకం చూస్తూ, తమ సంభాషణ వింటున్న మావయ్య అన్నాడు.

"అలా అనకండి! మీరంత నాకు ప్రోత్సాహ మివ్వాలి కానీ, ఇలా నిరుత్సాహ పరచడం ఏమీ బాగా లేదు. మనం చేయగలిగింది మనం చేయాలి! ఆపైన, ఆ భగవంతుని దయ!" బరువుగా నిట్టూర్చి అంది.

"పెద్ద వాళ్ళం గనక చెప్తున్నాం! వినను అంటే ఏం చెయ్యగలం? ఎవరో ఏదో చెప్తే, దానికే విలువ ఇస్తున్నావు!" కాస్త కోపంగానే అన్నాడు.


"అలా అంటే ఏం చెప్పను? ప్రశాంత్‌ను సరైన స్కూల్లో వేస్తే బాగా చదువుకుంటాడని నా ఆశ! వా డెంత తెలివి గలవాడో మీకు తెలీదా? సుజన సుమనల కన్నా తెలివైన వాడు!

"ఆఁ! ఆ తెలివికి నువ్వే మురిసి పోవాలి!" విసురుగా అంది అత్తమ్మ.

దాంతో, తన మనసు ముక్కలైంది.

కన్నుల్లో చివ్వున నీరు తిరిగింది.

అతి కష్టం మీద తనను తాను



సంభాళించుకుని అక్కడ నుండి లేచి వెళ్ళి పోయింది.

తమ ప్రయాణం సంగతి తెలుసుకుని ఆడబిడ్డ శాంత ప్రక్క ఊరి నుండి వచ్చింది.

ఆవిడా అదే పాట పాడింది!

ఇరుగూ పొరుగూ, స్నేహితులూ అంతా అదే మాట!

దాంతో తన పట్టుదల మరింత పెరిగింది.

"ఎవ్వరికీ ఇష్టం లేదు. నీ నిర్ణయం మార్చుకో, రమా!" ఆ రోజు సాయంత్రం స్కూలు నుండి వచ్చాక, ఆయనా అన్నారు.

అటు వాళ్ళకు, ఇటు తనకూ మధ్య ఆయన పరిస్థితి కష్టంగానే ఉందని తనకు తెలుసు. కానీ.....

"ఇది నా బిడ్డ భవిష్యత్తుకు సంబంధించిన విషయం! వాళ్ళందరి ఇష్టా యిష్టాలతో నాకు పని లేదు. నాకు కావలసింది మీ అంగీకారం!" మొండిగా, కటువుగా అంది తను.

"అంగీకారం ఇవ్వక తప్పదుగా?"

"సహకారం కూడా..."

"నీలో ఇంత పట్టుదల ఉందని నా కిప్పుడే తెలిసింది రమా!"

"సంతోషం! ఇప్పటి కన్నా తెలుసుకున్నారు!" బాధగా నవ్వుతూ అంది.

జవాబుగా నవ్వారు.

"రెండు రోజులు సెలవు తీసుకున్నారా? ముందా విషయం చెప్పండి!"

"తీసుకున్నాన్లే! లేకుంటే, నువ్వు నన్ను బ్రతకనిస్తావా?"

"అందరిలాగా మీరూ అంటున్నారా? ఇదంతా ఎవరి కోసం చేస్తున్నాను? మన బాబు కోసమేగా?" బాధాతప్త కంఠంతో అంది.

అప్పటి వరకు గుండెలో అదిమి పట్టిన దుఃఖం బుస్సున పైకి పొంగి కన్నీరుగా, చెంపల మీద ప్రవహించింది.

"సరే! సరే! ఇప్పు డేమన్నానని? ఊరుకో! విశాఖపట్నంలో నాకు ఉద్యోగం దొరికే వరకూ, నే నిక్కడ స్కూల్లోనే పని చెయ్యాలి. అంత వరకూ నువ్వొక్క దానివే అక్కడ ఉండాలి మరి. ఏమంటావు?" అన్నాడు శాంతంగానే.

"ఉండగలను! అక్కడ బోలెడన్ని స్కూళ్ళున్నాయి. ప్రయత్నిస్తే, ఏదో ఒక స్కూల్లో మీకు ఉద్యోగం దొరక్కపోదు. అంత వరకు ఒక్క దాన్నీ పిల్లలతో ఉండక తప్పదు." కన్నీరు తుడుచుకుంటూ అంది.

"అక్కడ ఇంటద్దెలు బాగా ఎక్కువ. నా కెంత జీతం వస్తుంది? ఇద్ద రాడ పిల్ల లున్నారు. ఆ విషయం మరచి పోకూడదు. అన్ని విషయాలూ బాగా ఆలోచించాలి."

"నేను ఇంటర్ పాసయ్యానుగా? ఏదో చిన్న ఉద్యోగం దొరక్క పోతుందా? లేదంటే, నాలుగు ట్యూషన్లు చెప్తాను. మీరు ధైర్యంగా ఉండండి!" నెమ్మదిగా అనునయ కంఠంతో అంది.

"ఇందరి మాట కాదని వెళ్తున్నాం! ఎన్ని కష్టాలను, సమస్యలనూ ఎదుర్కోవాలో!" ఆందోళన నిండిన కంఠంతో అన్నారు.

"మీ రేం భయపడకండి! బాబు సమస్య కన్నా మరో పెద్ద సమస్య మనకు లేదు. అంటే, దీని ముందు ఏ సమస్యయినా చిన్నదే, నా దృష్టిలో!" బరువుగా నవ్వి అంది.

ఆ తర్వాత ఆయన ఏదో ఆలోచనలో మునిగి పోయారు.

ఆ రాత్రంతా తనకు సరిగ్గా నిద్ర పట్టలేదు. ఆయనకు ధైర్యం చెప్పింది గానీ, అర్థం లేని భయమూ, ఆందోళనా తననూ పట్టి పీడించ సాగాయి.

పెళ్ళయిన మూడు సంవత్సరాలకు ఇద్దరి బిడ్డల తల్లి అయింది. ఇద్దరూ ఆడ పిల్లలే.

ఇంట్లో అంతా మగ పిల్లవాడు కావాలని, పట్టుపట్టడం వల్ల, ఎవరైనా సరే ఇద్దరు పిల్లలు చాలనుకున్న తన నిర్ణయాన్ని మార్చుకోవలసి వచ్చింది.

పెద్దల ఇష్టానికి తల వాల్చింది, అయిష్టంగానే. చిన్న పాపకు నాలుగో సంవత్సరం జరుగుతుండగా ప్రశాంత్ పుట్టాడు.

ఇంట్లో ఎంతో ఆనందించారు.

తన సంతోషానికి అవధు ల్లేవు.

వేలెడు లేని వాని చుట్టూ ఎన్నో ఆశల సౌధాలు కట్టింది!

వాని బంగారు భవిష్యత్తుకు ఎన్నెన్నో పథకాలు అప్పుడే తయారు చేసింది!

కాని, సంవత్సరం తిరిగే సరికల్లా, ఆ ఆనందం చాలా వరకు హరించుకు పోయింది!

బంగారు కలలు పేక మేడల్లా కూలిపోయాయి!

ప్రశాంత్ మామూలుగా లేడని వైద్య పరీక్షలో తేలింది!

ఆ రోజు అతి భయంకరమైన రోజు!

కుమిలి కుమిలి ఏడ్చింది!

రెండు రోజులు అన్నం ముద్ద నోట్లో పెట్టు కోలేక పోయింది.

మెల్లగా, ఎలాగో సర్దుకున్నా పూర్వపు మనిషి కాలేక పోయింది. సంవత్సరాలు జరుగుతున్నాయి. ప్రశాంత్ పెరుగుతున్నాడు. దానితో పాటు ఏదో చెప్పలేని దిగులూ, నిరాశా, నిస్పృహలు పెరుగుతూ వచ్చాయి, తనలో వాని భవిష్యత్తును గురించిన ఆందోళన రోజు రోజుకు ఎక్కువ కాసాగింది.

మామూలు స్కూల్లో చదువుకోలేడనీ, స్పెషల్ స్కూల్లో పెట్టాలనీ చెప్పారు.

అలాంటి స్కూలు తమ ఊర్లోగానీ, ప్రక్క ప్రక్క ఊళ్ళలో గానీ లేదు.


ఏ హైద్రాబాదో, విశాఖపట్నమో, కాకినాడో వెళ్ళాలి. అన్నింటి కన్నా విశాఖపట్నమే కాస్త దగ్గర తమకి. ఆ స్కూలుకు హాస్టలుందో, లేదో తనకు తెలీదు. ఉన్నా హాస్టల్లో అలాంటి పిల్లవాణ్ణి, అంత చిన్న వయసు నుండీ పెట్టడం తన కిష్టం లేదు.

అందుకే విశాఖ వెళ్ళాలని తీర్మానించుకుంది. కానీ, అందుకు అందరూ వ్యతిరేకమే! ఎదిరించక తప్పలేదు.

పది సంవత్సరాల క్రితం పిల్లలను తీసుకుని వచ్చేసింది. తను వచ్చిన ఓ సంవత్సరాని కల్లా, విశాఖలోని ఓ స్కూల్లో ఆయనకూ ఉద్యోగం దొరకడం ఓ విధంగా అదృష్టమే!

తనూ ట్యూషన్స్ చెప్పేది.

ఇప్పుడు సుమ బి.ఎస్‌సి. ఫైనలియర్ పరీక్షలు వ్రాయాలి. సుజా ఎన్‌ట్రన్సులో మంచి రాంకు



**చితకబాదుడు**

"అక్కడ జనం చితకబాదుతున్న దెవరినిరా?"

"నిన్న టీ.వీ.లో వచ్చిన హాస్య నాటిక డైరెక్టరునులేరా!"

బొమ్మెన శ్రీనివాసరావు [హైదరాబాదు]

తెచ్చుకుని, ఎం.బి.లో చేరింది.

ప్రశాంత్ పదో తరగతి పరీక్ష వ్రాశాడు!

క్లాస్‌లో వాడే ఫస్ట్!

ఆటల్లో ముందే ఉంటాడు!

పెయింటింగ్ కూడా చక్కగా చేస్తాడు!

ఈ రోజు స్కూలు వార్షికోత్సవ సందర్భంగా పిల్లలకు బహుమతు లిచ్చారు.

ప్రశాంత్ మొత్తం ఆరు ప్రైజులు తెచ్చుకున్నాడు! టెన్త్‌లో కూడా ఫస్ట్ క్లాసొస్తుందని టీచర్స్ చెప్పారు.

తను ఏ లక్ష్యం కోసం విశాఖ వచ్చిందో అది నెరవేరింది చాలా వరకు.

తను విశాఖ వచ్చాక, రెండు సంవత్సరాల వరకు వాళ్ళెవరూ రానూ లేదు. తనూ వెళ్ళనూ లేదు - కోపంతో. తర్వాత మావయ్య గుండె నొప్పితో హఠాత్తుగా చనిపోయాడు!

వార్త తెలిసి తాము వెళ్ళే సరికి అంతా అయిపోయింది. నిద్రలోనే గుండె పోటుతో పోయాడు. అత్తమ్మ ఆడబడుచు, దగ్గర బంధువులూ అంతా అందుకు కారణం తనే అన్నట్లు మాట్లాడడం తన కెంతో ఆశ్చర్యాన్ని కలిగించింది!

వాళ్ళ వైఖరి తన కర్థం కాలేదు.

అందరి కోప తాపాలకు, అపార్థాలకు గురయింది.

'ఈ గడప ఇక తొక్కకు' అని శాసించింది అత్తమ్మ! అది తన దురదృష్టమని సరిపెట్టుకున్నా లోలోపల బాధపడ కుండా ఉండలేక పోయింది.

అంతే, ఆ తర్వాత ఆయన వెళ్ళి వచ్చే వాడే గానీ తను వెళ్ళ లేదు. పిల్లలనూ పంపలేదు. అలాగైనా, పిల్లలను చూసేందుకు అత్తమ్మ వస్తుందని ఆశించింది. కానీ, ఆమె రాలేదు. తనను రమ్మనీ అనలేదు!

సంవత్సరం క్రితం ఆమెకు బాగా జబ్బు చేసింది. ముగ్గురి పిల్లలను తీసుకుని ఆయన వెళ్ళారు.

కొస్త బాగయ్యాక తమ దగ్గరకు వచ్చి ఉండమని ఆయనతో చెప్పి పంపింది తను. ఆమె పిలిచేంత వరకు తను వెళ్ళ దలచుకో లేదు.

"ప్రశాంత్‌ను చూసి అమ్మ చాలా సంతోషించింది. రమా! పైకి చెప్పలేదు గానీ, నీ మీద కోపం చాలా వరకూ తగ్గినట్లే!" అన్నా రాయన సంతోషంగా, తిరిగి వచ్చాక.

ఆ మాటలతో, ఏదో పెద్ద బరువు తన తల మీద నుండి తొలగిపోయినట్లు, తేలిగ్గా ఊపిరి తీసుకుంది.


ఇం కొన్నాళ్ళకు అత్తమ్మ తనను పూర్తిగా క్షమించ గలదన్న ఆశా కలిగింది. అంతే కాదు. ఆమె తన తొందర పాటునూ, పొరపాటునూ తెలుసు కుంటారనీ, ఆ రోజు ఎంతో దూరంలో లేదనీ అనిపించింది.

విశాఖ వచ్చిన ఈ పది సంవత్సరాలూ ఆయనా, తనూ ఎంతో శ్రమించారు.

శ్రమకు తగిన ఫలితం దక్కింది.

ఆడ పిల్లలు బాగా చదువు కుంటున్నారు.

ప్రశాంత్‌లో అద్భుతమైన మార్పొచ్చింది.




ఇప్పుడు అత్తమ్మ ప్రశాంత్‌ను, ప్రశాంత్ కొచ్చిన ప్రైజులను చూడాలి!

అందుకే ఆయనను పంపింది, ఎలాగైనా సరే, అత్తమ్మను బ్రతిమిలాడి, నచ్చ చెప్పి తీసుకు రమ్మని. శాంతను కూడా తీసుకు రమ్మని చెప్పింది.

ఈ ఆనందాన్ని అందరితో పంచుకోవాలని, పండుగలా జరుపుకోవాలనీ తన కోరిక!

అత్తమ్మ తన పట్టుదల వీడి వస్తుందో, లేదో?

• వాకిట్లో ఆటో ఆగిన శబ్దంతో రమ ఆలోచనలకు అంతరాయం కలిగింది.

ఒక్క ఉదుటున లేచి, గుమ్మంలో కొచ్చింది.

సుందరమ్మ, శాంత, రాజారావు లోపలి కొచ్చారు.

అప్పటికే పిల్లలు ముగురూ ముందు గదిలో కొచ్చారు. సుందరమ్మ రాగానే ప్రశాంత్‌ను దగ్గరకు తీసుకుని సంతోషంగా, సంతృప్తిగా వాని వేపు చూస్తుండి పోయింది. ప్రశాంత్ కూడా నవ్వుతూ, ప్రేమగా నానమ్మ ముఖంలోకి చూశాడు.

సుజా ప్రశాంత్ కొచ్చిన ప్రైజులన్నీ పట్టుకొచ్చి "నానమ్మా! చూడు! ప్రశాంత్! ఎన్ని ప్రైజులు గెల్చుకున్నాడో!" అంది.



**ఉపయోగం**

"బస్సులో ఫస్ట్ ఎయిడ్ బాక్స్ వల్ల ఉపయోగ మేమి?" అని పిల్లల్ని మాస్టా రడిగారు.

"డ్రైవర్లు, కండక్టర్లు బీడీలు దాచుకోవచ్చు మాస్టారు" చెప్పారు పిల్లలు.

ఏ. వెంకటేష్ [పాముదుర్తి]

సుందరమ్మ, శాంత ఆ ప్రైజుల వేపు, ప్రశాంత్ వేపు మార్చి మార్చి చూడ సాగారు.

"మా తండ్రే! మా నాయనే! ఎంత వాడ వయ్యావురా, బాబూ! నిన్ను దేవుడు చల్లగా చూడాలి! మన ఊళ్ళోనే ఉంటే దేనికి పనికి రాకుండా పోయేవాడివి రమా! రాజా అన్ని విషయాలు చెప్పాడు. తెలిసో తెలియకో మూర్ఖంగా ఏదో అన్నాను. అర్థం లేని పట్టుదలతో నీ మనసు కష్ట పెట్టాను. ఏమనుకోకు. అవన్నీ మరచిపోమ్మా" అంది కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుండగా, చలిత కంఠంతో సుందరమ్మ.

'ఎందుకూ పనికి రాడనుకున్న ఆ చెవిటి మూగ, వాడు ఎంత మారిపోయాడు! ఎంత ఎదిగాడు' అని మనసులో అనుకుంటూ-

"వదినా! నువ్వు చేసిన పని ఎంతో మంచిదని ఇప్పు డర్థమైంది. మొదట తెలీక ఏదో అన్నాం. అన లిలాంటి స్కూల్సు ఉంటాయనీ, సరైన శిక్షణ ఇస్తే మామూలు పిల్లల్లా వీళ్ళూ చదువుకో గలరని మాకు తెలిసి ఏడిస్తేగా? నీ పట్టుదలా, ధైర్యమూ మెచ్చుకో దగ్గవి" అంది శాంత ప్రశాంత్, రమల వేపు మెచ్చుకున్నట్లు చూస్తూ.

'ఈ రోజు కన్నా మీ రీ విషయం తెలుసుకున్నారు!' అని అనుకుంటూ -

"మీ రొచ్చినందుకూ, నేను చేసిన పని మంచిదని ఈ రోజు కన్నా చెప్పినందుకు సంతోషం, ఇలాంటి క్షణం కోసమే ఇన్ని రోజులుగా ఎదురు చూస్తున్నాను. దేవుడు నా ప్రార్థన విన్నాడు!" కన్నుల్లో నీరు చిప్పిల్లగా గద్గద కంఠంతో అంది రమ.

"ఇదో, ఈ పెన్ను నీకు! బాగుందా?" అంది శాంత బాగ్‌లో నుండి పెన్ను తీసి ప్రశాంత్ కిస్తూ.

"చాలా బాగుంది!" హియరింగ్ ఎయిడ్ సరి చేసుకుంటూ, సైగలతో చెప్పాడు.

తర్వాత అందరి వేపూ చూసి మృదువుగా నవ్వాడు. ఆ నవ్వు వెన్నెల్లా అందరికీ ఎంతో హాయిని కలిగించింది! •